


# బుద్ధిమంతుడి నిర్ణయం

— ప్రఫుల్ల చంద్ర

రాజేష్ బిఎస్సీ ఫస్ట్ క్లాస్. ఉద్యోగం కొనుక్కోవడానికి యాభై వేలు పట్టుకొని హైదరాబాద్ వెళ్ళబోతున్నాడు. ఎప్పుడూ హైదరాబాద్ మొహం చూడని అతనికి–

డబ్బు భద్రంగా కాపాడుకునే పద్ధతుల్ని పదోసారి, రైలు దిగగానే ఏ నంబర్ సిటీ బస్ ఎక్కి, ఎక్కడ దిగాలో ఆ వివరాల్ని ఆరోసారి, తను రాలేకపోతున్నందుకు కారణాల్ని నాలుగోసారి చెప్పి, "మరేం ఫర్వాలేదులే. అక్కడి వ్యవహారం అంతా చలపతి మామయ్య చూసుకుంటాడు" అని భరోసా ఇస్తూ జాగ్రత్తలు చెబుతున్నాడు తండ్రి వీరభద్రం.

విసీ, విసీ విసుగెత్తి పోయినా, బుద్ధిమంతుడు కాబట్టి రాజేష్ ఆ విసుగుని దాచిపెట్టి, సూట్‌కేస్ సర్దుకుంటున్నాడు మౌనంగా.

జరుగుతున్న హడావిడినంతా గమనిస్తూ కుత కుతా ఉడికిపోతున్నాడు ఇంటర్ పరీక్ష మూడో సారి ఫెయిలయి సొంత ఇంటిలోనే జీతం లేని నౌకరుగా పడివున్న నిరుద్యోగి రమేష్. అన్నయ్యకు యాభై వేలిచ్చి, తనకు పాతిక వేలైనా ఇవ్వని తండ్రి మీద కోపంగా వుందతనికి.

"ఒరేయ్, అన్నయ్యా! ఎందుకైనా మంచిది, ఆ డబ్బుని చిన్న గుడ్డ సంచిలో పెట్టి ఆ సంచిని నీ ప్యాంట్ లోపల కుట్టుకో" అన్నాడు రమేష్.

రమేష్‌తో సమస్య అదే. జోక్ చేస్తున్నాడో, సీరియస్‌గా అంటున్నాడో ఎవరికీ తెలియదు. ఆ సలహాని రాజేష్ జోక్‌గా తీసుకున్నా, తండ్రి మాత్రం సీరియస్‌గా తీసుకుని డబ్బు సంచిని ప్యాంట్‌కి కుట్టే బాధ్యత కూతురికి అప్పగించాడు.

ఆ పని పూర్తయ్యాక ప్యాంట్ ధరించి రాజేష్ ఇబ్బందిగా ఫీలవుతుంటే–

"ఒరేయ్! ఈసారి డబ్బుతో పాటు ప్యాంట్ కూడా పోగలదు. ఎందుకైనా మంచిది ప్యాంటుని కొబ్బరి తాడుతో నడుముకి బిగించి కట్టుకో" అన్నాడు రమేష్.

అది జోక్ అని అర్థమైపోయిన అందరూ కొర కొరా చూశారు అతనివైపు.

వీరభద్రం కొడుకుతో స్టేషన్‌కి వెళ్ళి, దారి పొడ వునా తీసుకోవలసిన జాగ్రత్తలతో అతని బుర్ర వాయగొట్టి, బండి ఎక్కించి వచ్చాడు ఇంటికి.

ఆయన రాగానే–

"అన్నయ్యకి యాభై వేలు ఇచ్చారు గాని నాకు పాతికైనా ఇవ్వలేదు" అన్నాడు నిష్ఠూరంగా రమేష్.

రమేష్‌కి తలతిక్క. ఎడ్డెం అంటే తెడ్డెం. తనకి చదువు అబ్బదు. ఉద్యోగం వచ్చదు. తండ్రి, కొడుకులకు ఒక్క క్షణం పడదు. రోజూ ఘర్షణే.

రమేష్ అలా అనగానే వీరభద్రానికి కోపమొచ్చే సింది.

"జొమరా. వాడికిస్తాను. నీకెందుకివ్వాలి? వాడి లాగా బుద్ధిమంతుడివా? తెలివైనవాడివా? ఇంటర్ కూడా దాటలేని బడుద్ధాయివి! నీకు ప్యాష్

ఉద్యోగం కూడా దొరకదు. నీమీద ఖర్చు శుద్ధ దండగ!" అంటూ ఉరిమాడు.

ఆ అరుపులకు రమేష్ బెదిరిపోలేదు.

"ఉద్యోగం కోసం ఎందుకు దేబిరింపు? ఉద్యోగం అంటే బానిసత్వం! పని చేసినా, చేయకపోయినా ఠంచన్‌గా నెలజీతం వచ్చేస్తుందన్న ఆశతో ఆఫీసర్ల తిట్లు భరిస్తూ పడివుండే మీలాంటి వారికి ఉద్యోగాలు! ఆ ఫైళ్ళు గిలకడానికి ఆలోచనా, ప్రతిభా ఎందుకు? అంతా రొటీన్. మీకు కొత్త ఆలోచన అంటే భయం! స్వశక్తి మీద నమ్మకం లేదు! ఆలోచన, ఆత్మ విశ్వాసం, ప్రతిభ వున్న నాలాంటి వాడికి ఉద్యోగం అక్కరలేదు. నాకో పాతిక వేలు పడేయండి. నా తడాఖా చూపిస్తాను" అన్నాడు నిర్లక్ష్యంగా.

"పాతిక వేలు కాదు కదా పాతిక రూపాయిలైనా ఇవ్వను. నీలాంటి వెధవకిచ్చేకంటే చెత్త కుండీలో పడేయడం నయం!" కోపాన్ని మింగుకుంటూ అరిచాడు వీరభద్రం.

అమీ తుమీ తేల్చుకోవడానికే నిర్ణయించుకున్నాడు కాబోలు రమేష్—

"ఏమిటీ తెగ రెచ్చిపోతున్నారు? అడ్డమైన వాళ్ళకు వంగి వంగి నమస్కారాలు చేస్తూ లంచాలు మింగే మీరు నీతిమంతులా?! లంచంతో కొడుక్కి ఉద్యోగం కొనాలనుకుంటున్న మీరు బుద్ధిమంతులా!? ఆ యాభై వేలతో లోన్ సంపాదించి ఏదైనా వ్యాపారం ప్రారంభించడం గొప్పదా? స్వతంత్రంగా ఉద్యోగం కొనుక్కొని మీలాగే మీ అబ్బాయి కూడా మరొక లంచగొండిగా మారితే మీకు ఆనందమా? ఏం, మాట్లాడరేం?" అని రెట్టించాడు.

బి.పి. పెరిగిపోయి, చలిజ్వరం వచ్చిన వాడిలా ఒణికిపోతూ ఇంక నిగ్రహించుకోలేక వీరభద్రం కొడుకు చెంపలు వాయగొట్టి "పోరా, పో! నా ఇంట్లోంచి పో! నీ ముఖం కనిపించనీయకు!" అని అరిచేశాడు.

అంతే! రమేష్ హూంకరించి వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిపోయిన రమేష్ వారం రోజులైనా తిరిగి రాలేదు కాని హైదరాబాద్ వెళ్ళిన రాజేష్ మాత్రం వచ్చేశాడు ఉత్తి చేతులతో. ఫార్మాలిటీస్ అంటూ పదివేలు ఖర్చు పెట్టించి యాభై వేలకు అటెండర్ పోస్ట్ కూడా రాదు పొమ్మన్నారట!

రమేష్ ఇంక ఇంటికి రాడన్న అనుమానం బలపడుతున్న కొద్దీ తల్లి కాంతమ్మ డీలాపడి బెంగపెట్టుకుంది. కొడుకుని సరిగా అర్థం చేసుకోలేదేమో నన్న ఆలోచనలో పడ్డాడు వీరభద్రం.

కాని, కలెక్టర్ ఆఫీసు వద్ద చెట్టు కింద రమేష్ టీ బడ్డీ పెట్టుకున్నాడని తెలిసి ఆయన హృదయం జుగుప్సతో నిండిపోయింది. మాసిపోయి మరకలు పడిన బనీను ధరించి, నడుము చుట్టూ తోలు లాంటి తువ్వాలు చుట్టుకుని టీ బడ్డీ వాళ్ళు ఎంత అసహ్యంగా వుంటారో తెలుసు ఆయనకు!

ఒక సంవత్సరం గడిచాక—

వీరభద్రం రిటైరయ్యాడు కాని రాజేష్‌కి ఉద్యోగం దొరకలేదు.

రమేష్ ఒక బైక్ కొనుక్కొని, ఒక అసిస్టెంట్‌ని పెట్టుకున్నాడు.

మరో ఏడాది గడిచాక—

రిటైర్‌మెంట్ డబ్బుతో వీరభద్రం కూతురికి భర్తని కొనగలిగాడు గాని కొడుక్కి ఉద్యోగం కొనలేకపోయాడు. ఈలోగా చెట్టుకింద రమేష్ టీ బడ్డీ చిన్న హోటల్ గా మారింది.

నాలుగేళ్ళ తర్వాత—

వీరభద్రానికి నిరుద్యోగి కొడుకు కంట్లో నలుసులా, చెప్పులో రాయిలా, చేతగాని చవట లాగా కనిపించసాగాడు. పొగిడిన నోటితోనే ఇప్పుడు కొడుకుని చీటికి మాటికి తిడుతున్నాడు. రాజేష్ కుమిలిపోతున్నాడు.

ఓరోజు హటాత్తుగా రమేష్ వూడిపడ్డాడు.

కొస్త నల్లబడినా హుందాగా కన్పిస్తున్నాడు. మొరటుగా రౌడీ లాగా కనిపించే అతను ఇప్పుడు ఖరీదైన దుస్తుల్లో దర్జాగా మెరిసిపోతున్నాడు. సుడిగాలి లాగా లోనికి దూసుకువచ్చి అమ్మను ఎత్తేసి గిరగిరా తిప్పేసి తర్వాత ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి తను కింద కూర్చుని ఆమె ఒడిలో తల పెట్టుకున్నాడు.

ఆ కన్నతల్లి హృదయం ఉప్పొంగిపోయింది. "ఇన్నేళ్ళకు ఇప్పుడా అమ్మ జ్ఞాపకం వచ్చింది?" అంది రుద్ధ స్వరంతో.

తన విజయగాథ చెప్పకొచ్చాడు రమేష్

రెండేళ్ళు టీ బడ్డీలో క్షణం తీరిక లేకుండా అష్టకష్టాలూ పడి నిలదొక్కుకొని చిన్న హోటల్ ప్రారంభించాడట. అది ఇప్పుడు పెరిగి పెద్దదయింది. హోటల్‌ని చూసుకోవడానికి ఇప్పుడు మేనేజర్‌ని నియమించాడు. కనుక తనకి కొస్త తీరిక గానే వుంది. అందుకే అమ్మని చూడడానికి వచ్చాడు.

ఆ గదిలో ఒక మూల నిర్వేదంగా నిలబడిపోయిన అన్నయ్య మీద దృష్టి పడగానే—

"ఒరేయ్, అన్నయ్యా! నీకింకా ఉద్యోగం దొరకలేదు కదూ! నీలాంటి బుద్ధిమంతుడితో సమస్య ఇదేరా. బుద్ధిమంతుడన్న ఇమేజ్ కాపాడుకోవడానికి గంగిరెద్దులాగ ఇతరుల అభిప్రాయాలకు తల వూపడం తప్ప స్వయం నిర్ణయం తీసుకోలేరు నాన్నగారి అభిప్రాయానికి తల ఒగ్గి లంచం పోసి బానిసత్వం కొనుక్కోవడానికి సిద్ధపడుతున్నావు గాని ఆ డబ్బుతో స్వయం ఉపాధికి పూనుకోవు. నన్ను చూడు. నాన్న సాయం చేయలేదు. ప్రభుత్వం సాయం చేయలేదు. ఒక పుణ్యాత్ముడిచ్చిన పది వేలతో వ్యాపారం ప్రారంభించి ఇప్పుడు రోజుకు వేయి రూపాయిలు లాభం తీసే స్థితికి ఎదిగాను. ఇంకా ఎదుగుతాను. ఆరుగురికి ఉద్యోగాలిచ్చి పోషిస్తున్నాను. నలుగురితో చేరి రాజధానిలో ఒక హోటల్ ప్రారంభించబోతున్నా. అన్నయ్యా! నాతో వచ్చేయ్. నా హోటల్‌లో నీకు పని ఇస్తా".

ప్రక్క గదిలోంచి అంతా వింటున్న వీరభద్రం ఇంక నిగ్రహించుకోలేక దూసుకొచ్చి—

"ఇస్తావురా! ఇస్తావ్. హోటల్‌లో ప్లేట్లు కడిగే ఉద్యోగం!" అన్నాడు వెటకారంగా.

కొడుకు మాటలను ఆపేక్షగా ఆలకిస్తున్న కాంతమ్మ భర్త మాటలకి ఉలిక్కిపడింది. దిగ్గున లేచి నిలబడిపోయింది. రమేష్ కూడా లేచి నిల్చున్నాడు. తండ్రి వంక సూటిగా చూస్తూ—

"అధికారుల కింద బానిసగా పడి వుండటం తప్ప శ్రమ జీవన సౌందర్యం గురించి మీకేం తెలుసు? మీ ముద్దుల కొడుకుని కూడా బానిసగానే మార్చండి. నాకు కొస్త మానవత్వం వుంది కాబట్టి అన్నయ్య నా కింద పడివుంటే కొస్త స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ, మెలకువలు నేర్చుకునే ప్రతిభ వుంటే మరో హోటల్‌కి యజమానిగా ఎదుగుతాడని రమ్మంటున్నా. నేను ఇచ్చేది ప్లేట్లు కడిగే ఉద్యోగం కాదు. కాషియర్ ఉద్యోగం" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు. జీవితంలో మొదటిసారిగా భర్త వైఖరికి నిరసన వ్యక్తం చేస్తూ వంట గదిలోకి విసవిసా నడిచి వెళ్ళిపోయింది కాంతమ్మ. అది అవమానంగా భావించిన వీరభద్రం తన గదిలోకి వెళ్ళిపోయాడు కోపంగా.

దిక్కు తోచని వాడిలా అయోమయంగా అక్కడే వుండిపోయాడు రాజేష్.

ఆరు నెలలు గడిచాయి.

ఇంకా ఉద్యోగం దొరకని రాజేష్‌కి చాలా టెన్షన్‌గా వుంది. మరో నాలుగు నెలల్లో ఉద్యోగం దొరక్కపోతే— ఇంక శాశ్వతంగా దొరకదు. వయసు మించిపోయి అర్హత పోతుంది. వీరభద్రం ఇల్లు తాకట్టు పెట్టి లక్ష రూపాయిలిచ్చి రాజేష్‌ని మళ్ళీ హైదరాబాద్ చలపతి ఇంటికి పంపాడు ఆఖరి యత్నంగా.

రాజేష్ వెళ్ళి వారం రోజులు గడిచినా ఏ సంగతీ తెలియక టెన్షన్‌తో చలపతికి వీరభద్రం ఫోన్ చేశాడు. రాజేష్ అసలు తన ఇంటికే రాలేదని జవాబు రావటంతో వీరభద్రం స్వయంగా బయల్దేరాడు.

తెల్లవారే సరికి హైదరాబాద్‌లో రైలు దిగి సిటీ బస్సు కోసం ఎదురు చూస్తున్న ఆయనకు బస్సు ఎంత సేపటికీ రాకపోయేసరికి టీ తాగాలనిపించింది. చుట్టూ పెద్ద హోటళ్ళు చాలానే వున్నా కొస్త నీటుగా కనిపిస్తున్న చిన్న హోటల్‌లో అడుగు పెట్టాడు.

అంతే!

ఎదురుగా క్యాషియర్ స్థానంలో కూర్చున్న వ్యక్తిని చూడగానే రెండో అడుగు పడలేదాయనకు!